తమ్ముళ్లకు జీ హుజూర్!

- సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చక్రం తిప్పుతున్న కూటమి నేతలు
- కాసులున్న వారికే వత్తాసు
- అధికారపార్టీ పెద్దలతో 'పర్సనల్' సమావేశాలు
- పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు


సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 'అన్నా.. మా వాడు బార్‌లో మద్యం తాగి ఆ మత్తులో ఎదురుగా ఉన్న కుర్రోడిని చితకబాదాడు. పెద్ద గొడవ అయింది. స్టేషన్‌లో మాట్లాడాలన్నా..'
'అవునా.. ఏ స్టేషను.. సింగ్‌నగర్ పోలీస్‌స్టేషనా.. ఇక నీ పని అయిపోయినట్లే.. ఏమి భయపడకు స్టేషన్‌లో అంతా మనోళ్లే.. మేము చూసుకుంటాంలే..'
ఇదీ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బార్‌లో జరిగిన గొడవ సందర్భంగా నిందితుడికి ఓ టీడీపీ నాయకుడు ఇచ్చిన భరోసా.
అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏ చిన్న గొడవ జరిగినా.. ఎంత పెద్ద స్కాములు జరిగినా తెలుగు తమ్ముళ్లు టక్కున ఠాణా వద్ద వాలిపోయి కాసులున్న వాడికి వత్తాసు పలుకుతున్నారు. బాధితులకు న్యాయం జరగకపోగా వారికే అన్యాయం జరిగేలా చక్రం తిప్పేస్తున్నారు. ఇటీవల కాలంలో స్టేషన్‌లో వీరి ఆగడాలు రోజు రోజుకూ మితిమీరిపోతుండటం.. న్యాయం నిర్వీర్యం అయిపోతుండడంతో పోలీస్‌స్టేషన్‌పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆరోపణలకు కొన్ని ఉదాహరణలు ఇవే..

- సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలిని మేనల్లుడు వరుసయ్యే వ్యక్తి మోసం చేసి ఆమె అకౌంట్‌లో ఉన్న రూ.48లక్షల వరకూ కాజేశాడు. దీంతో ఆ వృద్ధురాలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విషయం చెప్పగా, తెలుగు తమ్ముళ్ల ఒత్తిళ్లతో పోలీసులు నిందితుడికి వత్తాసు పలికి ఆ వృద్ధురాలి గోడును పట్టించుకోకపోవడంతో ఆమె స్పందనలో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు రూ.13లక్షలు రికవరీ చూపించి, మిగిలిన సొమ్మును అప్పగించడంలో జాప్యం చేస్తుండడంతో పాటుగా తిరిగి నిందితుడు కూతురు వరుసయ్యే మహిళతో బాధితులపై పోలీసులకు ఫిర్యాదు ఇప్పించి ఆ వృద్ధురాలిని ముప్పుతిప్పలు పెడుతున్నట్లు తెలుస్తోంది.
- న్యూరాజరాజేశ్వరీపేటకు చెందిన ఓ వృద్ధురాలు ఇటీవల మరణించింది. దీంతో ఆమెకు ఎవరూ లేరని తెలుసుకున్న కొంతమంది 'తమ్ముళ్లు' రంగంలోకి దిగి ఆమె బంగారం, బ్యాంకులో ఉన్న నగదును కొట్టేసేందుకు ప్రయత్నించారు. దీంతో వృద్ధురాలి చెల్లెలు, కుటుంబ సభ్యులు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులకు వత్తాసుగా వచ్చిన తమ్ముళ్లతో బేరం కుదుర్చుకొని మీకెంతా.. మాకెంతా.. అని మాట్లాడుకొని, రాజీ కుదిర్చినట్లు తెలిసింది. ఆ వృద్ధురాలి డెత్ సర్టిఫికెట్ వచ్చిన తరువాత బ్యాంకులో ఉన్న నగదు, ఇళ్లు, బంగారం మొత్తం లెక్కలు కట్టి పంపిణీ చేసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.
- మే నెలలో సంచలనం సృష్టించిన బంగారం స్కీముల పేరుతో చేసిన స్కాములో నిందితుడికి కొంతమంది పోలీసులు కొమ్ముకాసి భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో ఓ ఎమ్మెల్యే అనుచరుడు రంగంలోకి దిగి బాధితుల్లో ఉన్న తమ వారికి రికవరీ సొమ్ములో భాగాన్ని అప్పగించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.
- ఇటీవల జరిగిన ఓ ఫార్మసీ కంపెనీ చైర్మన్ ఆత్మహత్య కేసులో 306 కింద కేసు నమోదు చేసిన పోలీసులు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్న, అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేయకుండా పెద్ద బేరమే కుదిరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారికి బెయిల్ మంజూరయ్యే వరకూ అదుపులోకి తీసుకోకుండా ఉండేలా కూటమి ప్రభుత్వ పెద్దలు మధ్యవర్తిత్వం జరిగించారనే విమర్శలు వస్తున్నాయి.

అంతా 'పర్సనల్'గానే..

సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో అవినీతి రాజ్యమేలుతోందని, స్టేషన్‌లో 'పర్సనల్'గా చెలామణి అవుతున్న వ్యక్తి అందరికీ 'సయోధ్య' కుదర్చుతూ తమ్ముళ్ల మద్దతుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్‌కు ఏ కేసు వచ్చిన ఇతగాడు 'పర్సనల్'గా వారిని కలుసుకొని వారు చెప్పినట్లుగా నడుచుకుంటూ అసలైన బాధితులకు న్యాయం జరగకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది. న్యాయం కోసం స్టేషన్‌కు వస్తున్న తమకు చివరికి అన్యాయమే జరుగుతుందని.. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ స్టేషన్‌కు అంటుకున్న అవినీతి బురద మరకలను క్షుణ్ణంగా పరిశీలించి.. ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్టేషన్ ఆవరణనే తమ కార్యాలయాలుగా మార్చుకున్న తెలుగు తమ్ముళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని స్థానిక ప్రజలు ప్రాధేయపడుతున్నారు.

19న ఎనికేపాడులో పీజీఆర్ఎస్

విజయవాడరూరల్: రూరల్ మండలంలోని ఎనికేపాడు గ్రామంలో ఈ నెల 19వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరుగుతుందని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఐదు గంటలకు ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని సూచించారు.

ఇగ్నో ప్రవేశాలకు గడువు పొడిగింపు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం జూలై-2025 సెషన్‌కు ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తుల స్వీకరణను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత తెలిపారు. పీజీ, డిగ్రీ రెండు, మూడో సంవత్సరం చదివే విద్యార్థులు రీరిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా లేదా 0866–2565253 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించొచ్చని ఆ ప్రకటనలో సూచించారు.

క్లుప్తంగా

నేడు గుణదల 220కేవీ విద్యుత్ లైన్‌లకు మరమ్మతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదల 220 కేవీ విద్యుత్ లైన్‌ల మరమ్మతులు గురువారం చేపట్టనున్నట్లు ఏపీ ట్రాన్స్‌కో గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ ఎం. కిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. వీటీపీఎస్ నుంచి గుణదల విద్యుత్ కేంద్రానికి వచ్చే 220కేవీ లైన్ మరమ్మతులు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం నున్న నుంచి గుణదల వచ్చే 220 కేవీ సర్క్యూట్–1 పరికరాలు మార్చడం, రీ రూటింగ్ పనులు మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకూ నిర్వహిస్తామని తెలిపారు. ఆ సమయంలో వినియోగదారులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒకవేళ అత్యవసర పరిస్థితి ఏర్పడితే సరఫరాకు అంతరాయం కలగవచ్చని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చిన్నారి గుండె ఆపరేషన్‌కు ఆర్థిక సాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): హృద్రోగంతో బాధపడుతున్న చిన్నారికి గురువారం మాకినేని బసవ పున్నయ్య యోగా వాకర్స్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. యోగా ఆచార్య, డెప్యూటీ గవర్నర్ ఎన్‌టీజీఎం ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన అవనిగడ్డ రామకృష్ణ కుమార్తె చిన్నారి శిరీష (7) హృద్రోగంతో బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తాము తమ వంతు సాయంగా రూ.10వేలను గుండె శస్త్ర చికిత్స నిమిత్తం పాప కుటుంబ సభ్యులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ పీవీ రత్నం, రమణ, రామారావు, జిల్లా వాకర్స్ అదనపు కార్యదర్శి కొండాయగుంట రాము, బండారు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కరువు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రానికి ఒక మహిళ హోం మంత్రిగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువయ్యిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం త్రివేణి రెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత కొంతకాలంగా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వేధింపులు రోజురోజుకీ పెరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. అయితే వీటిపై హోంమంత్రి స్పందన నిరాశపరిచేలా ఉందని అన్నారు. హోం మంత్రి మహిళల భద్రతను పట్టించుకోకుండా కేవలం ప్రతిపక్ష నాయకులపై విమర్శలు చేయడం, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తప్పుపట్టడానికే పరిమితమయ్యారన్నారు. ఇప్పటికైనా హోంమంత్రి స్పందించి మహిళలపై జరిగే అఘాయిత్యాలు, దాడులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి తన పదవిని అలంకారంగా కాకుండా, బాధ్యతగా పరిగణించి మహిళలు, రాష్ట్రానికి మేలు జరిగేలా తగిన నిర్ణయాలు తీసుకోవాలని త్రివేణి రెడ్డి కోరారు.

విద్యార్థినికి సైకిల్ వితరణ



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సమాజ అభివృద్ధికి దోహదపడేది చదువు ఒక్కటేనని.. నిరుపేద విద్యార్థులను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతిఒక్కరిపై ఉందని కళ్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు అన్నారు. సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వర్షితకు స్కూల్‌కు వెళ్లేందుకు ఉపయోగపడే సైకిల్‌ను బహూకరించారు. పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు తాము ఎల్లవేళలా ముందుంటామన్నారు. ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మి, జయదుర్గా, మేఘవాణి, ముప్పూరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 45మందికి జరిమానా

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలో రోడ్డు ప్రమాదాలు నివారించే క్రమంలో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 45మంది వాహన చోదకులకు కోర్టు జరిమానాలు విధించింది. నగరంలోని రెండో, నాల్గో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 45 మందిని గుర్తించారు. వారిని ఆరో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి లెనిన్‌బాబు వారికి రూ.5లక్షల 10వేలు జరిమానా విధించారు. 12 మందికి ఒక్కొక్కరికీ రూ.15వేలు చొప్పున రూ.1లక్ష 80వేలు, 33మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.3లక్షల 30వేలు జరిమానా విధించారు.

వర్షపు నీరు పోయేదారేది?


లోటస్ ల్యాండ్ మార్క్ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు


రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని యూజీడీలోకి తరలిచేందుకు మూతను తెరుస్తున్న స్థానికులు


మధురానగర్ ఆర్‌యూబీ సమీపంలో నిలిచిన వర్షపునీరు

- నిరుపయోగంగా మురుగు కాలువలు
- చిన్నపాటి వర్షానికే జలమయం అవుతున్న రోడ్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయి వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలలో సైతం వర్షంనీరు నిలిచిపోవటం పట్ల వాహన చోదకులు స్థానికులు రాకపోకలకు నానాయాతన పడుతున్నారు. మధురానగర్, ముత్యాలంపాడు, అయోధ్యనగర్, మాచవరం, ఏలూరు రోడ్డు, సత్యనారాయణపురం, దుర్గాపురం, రామకృష్ణాపురం, హనుమాన్ పేట తదితర ప్రాంతాలలో ఎవరికి వారు స్వప్రయోజనాల కోసం మురుగుకాలువలను పూడ్చివేశారు. మరికొంత మంది మురుగుకాలువలపై చప్టాలు వేయించారు. అలాగే పలువురు మురుగుకాలువలను రోడ్డుకన్నా ఎత్తులో ఉండేలా ర్యాంపులు సైతం నిర్మించారు. దీంతో ఈ ప్రాంతాలలో వర్షపునీరు బయటకు పోయే మార్గం లేదు. ఇక్కడ వర్షపునీరు ఎండకు ఎండాల్సిందే తప్ప మరో మార్గం లేకపోవటంతో వర్షం పడిన తర్వాత వీఎంసీ సిబ్బంది ఎయిర్‌టెక్ మెషీన్‌లతో తొలగిస్తున్నారు.

అలంకారప్రాయంగా కాలువలు..
మురుగుకాలువలు అలంకార ప్రాయంగా మారాయి. వర్షపునీరు, మురుగునీరు బయటకు పోయేందుకు నిర్మించిన మురుగుకాలువలను ఎక్కడికక్కడ స్వార్థ స్వప్రయోజనాల కోసం పూడ్చివేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. కొంత మందైతే ఏకంగా మురుగుకాలువను దాటి మూడు నుంచి ఐదు అడుగుల వరకు ర్యాంపులు చేయించారు. మురుగుకాలువలను శుభ్రం చేయాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది మురుగుకాలువలపై చప్టాలు చేయటంతో శుభ్రం చేయటం లేదు. దీంతో మురుగుకాలువలు సక్రమంగా పారకపోవటంతో పాటు రోడ్డు కన్నా ఎత్తులో ఉండటం, ర్యాంపులు అడ్డుగా ఉండటంతో వర్షం వచ్చినప్పుడు వర్షపునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. కొంత మందైతే రోడ్డుపై నిలిచిన వర్షపునీటిని బయటకి పంపించేందుకు వారే పనులు చేసుకుంటున్నారు.

పాడవుతున్న రోడ్లు..
వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవటం వల్ల రోడ్లు సైతం త్వరితగతిన పాడవుతున్నాయి. రోడ్లు గుంతలు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. కావున అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని.. మురుగు కాలువలను మూసివేయటం, ఆక్రమణలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన పార్క్ మరమ్మతులు

- రూ.18 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు
- పనుల నిర్వహణలో ఐదు నెలలుగా జాప్యం
- అసౌకర్యానికి గురవుతున్న సందర్శకులు


దెబ్బతిన్నా సరిచేయని మెష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం బైపాస్ రోడ్డు పక్కన ఉన్న అమృత పార్క్ రెనోవేషన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఐదు నెలలుగా అడుగు ముందుకు మూడడుగులు వెనక్కు అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఎండాకాలం పూర్తయ్యే నాటికి పనులు పూర్తి చేస్తే ఆటంకాలు ఉండేవి కావు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడం, ఇతర కారణాలతో పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో నిత్యం పార్క్‌లో వాకింగ్ చేసే వారు, సందర్శకులు అసౌకర్యానికి గురవుతున్నారు.

రూ.19 లక్షలతో..
భవానీపురం బైపాస్ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీకి మార్జిన్‌లో 2016లో అమృత పార్క్ ఏర్పాటు చేశారు. చర్చి సెంటర్ నుంచి భవానీపురం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు నాలుగు భాగాలు ఈ పార్క్‌ను అభివృద్ధి చేశారు. పోలీసు స్టేషన్ సమీపంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్, చక్కటి నీడ నిచ్చే చెట్లు ఉండడంతో నిత్యం ఉదయం సాయంత్రం సమీప ప్రాంతాల వారు వాకింగ్ చేస్తుంటారు. ఉదయం సాయంత్రం వేళల్లో సేద తీరేందుకు స్థానికులు పార్కుకు వచ్చేవారు. రోడ్డు వైపు నుంచి పార్క్‌లోకి పశువులు, జంతువులు వెళ్లేందుకు వీలు లేకుండా ఐరన్ మెష్ ఏర్పాటు చేశారు. సరైన రక్షణ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు చాలా వరకు మెష్‌ను కత్తిరించి ఎత్తుకెళ్లారు. మిగిలిన మెష్ వేలాడుతూ అస్తవ్యస్తంగా పడి ఉంది. గేట్లు కూడా కూలిపోవడం స్క్రాప్ కలెక్షన్ చేసేవారు తీసుకెళ్లి పోయారు. దీంతో పార్క్ రెనోవేషన్‌కు రూ.19 లక్షలు మంజూరయ్యాయి. మెస్ ఏర్పాటు చేయడం, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు వంటి పనులు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో చురుకుగా సాగిన పనులు ఆ తర్వాత నత్తనడకన సాగుతున్నాయి. వేసవి కాలంలోనే పనులు ప్రారంభమయ్యాయి. వర్షాకాలం ప్రారంభమైన పనులు పూర్తి కాలేదు. వాకింగ్ ట్రాక్‌కు మట్టి తోలారు. అది చదును చేయకపోవడంతో ట్రాక్ పొడవునా చిన్న చిన్న దిబ్బలుగా ఏర్పడింది. ఎగుడుదిగుడుగా ఉండడంతో వాకింగ్‌కు వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త.. పాత మెష్
పార్క్‌కు ఏర్పాటు చేసిన మెష్ చాలా వరకు దెబ్బతింది. రెనోవేషన్ పనుల్లో పాత మెష్‌ను చాలా వరకు సరిచేశారు. వెల్డింగ్ పెట్టి సర్దుబాటు చేశారు. అక్కడక్కడ కొత్తది వాడారు. చాలా భాగం తుప్పు బట్టి ఉంది. మొత్తం కొత్త మెష్ వేస్తే ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పాతదాని తుప్పు వర్షాలకు కొత్త వాటికి పాకి దెబ్బతింటుందంటున్నారు. అధికారులు మాత్రం పాతది సరిచేసి కొత్తది అవసరమైతే వాడాల్సి ఉంటుందంటున్నారు. పనులు మరో వారం రోజుల్లో పూర్తవుతాయని, పార్క్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. పార్క్‌లో పనుల పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది. స్థానికులు మాత్రం త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.


మట్టిదిబ్బలతో ఎగుడు దిగుడుగా వాకింగ్ ట్రాక్

బీసీ ఉద్యోగుల గ్రీవెన్స్‌ను పునరుద్ధరించాలని వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీఎస్ ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రీజనల్ స్థాయిలో నెలకు ఒకసారి, హెడ్ ఆఫీస్ స్థాయిలో మూడు నెలలకొకసారి నిర్వహించే గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను పునరుద్ధరించాలని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.పి.శేషగిరిరావు నేతృత్వంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్ ప్రాంగణంలోని ఆర్టీసీ హౌస్ భవనంలోని సంస్థ ఎండీ, పీటీడీ కమిషనర్ ద్వారకాతిరుమలరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత విధానపరంగా ఇటువంటి మీటింగ్‌లు నిలిపివేశారని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పని విధానం, మిగిలిన ప్రభుత్వ ఉద్యోగుల పనితీరుకు భిన్నంగా ఉన్నందున అత్యవసర సర్వీస్‌ల విభాగంలోని ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాల తరహాలోనే తమకూ గ్రీవెన్స్ జాయింట్ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా ఆర్టీసీలో 45 శాతానికిపైగా ఉన్న బీసీ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఆర్టీసీ ఎండీని కలిసిన వారిలో బీసీ సంఘాల నాయకులు దువ్వారపు రామారావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈతాకుల కృష్ణారావు, నాయకులు కె.ఎం.లక్ష్మణుడు, వి.జె.రత్నం, వి.జానకిరాం, టి.సూరిబాబు తదితరులు ఉన్నారు.

రూ.500 టికెట్‌కు ప్రత్యేక క్యూలైన్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ప్రత్యేకంగా రూ. 500 టికెట్ క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఆలయ ఈవో శీనా నాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మహామండపం 7వ అంతస్తులోని తులాభారం, కళావేదిక పరిసరాలను గురువారం ఉదయం ఆయన పరిశీలించారు. తులాభారం వద్ద రూ. 300, రూ.500 టికెటు క్యూలైన్లు రెండు కలిపి ఉండటం గమనించారు. రద్దీ వేళల్లో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నందున రూ.500 టికెట్ క్యూలైన్ కోసం అదనంగా మరో క్యూలైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొద్దిసేపటి తర్వాత ప్రారంభమైన అదనపు క్యూలైన్ పనులను ఈవో శ్రీనానాయక్ పరిశీలించారు.

తిరుపతమ్మకు సారె సమర్పణ

పెనుగంచిప్రోలు: ఆషాఢ మాసం సందర్భంగా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారికి ఆలయ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు గురువారం సారె సమర్పించి బోనాలు చెల్లించారు. గ్రామంలోని అమ్మవారి రంగుల మండపం వద్ద నుంచి సన్నాయి వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. వీరికి ఆలయ వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్.రమ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మనోహరం.. సాత్విక భరతనాట్య రంగ ప్రవేశం


భరతనాట్య సంప్రదాయంలో రంగప్రవేశం చేస్తున్న సాత్విక

విజయవాడ కల్చరల్: ప్రవాసాంధ్ర నృత్య కళాకారిణి దెందుకూరి లక్ష్మీ సాత్విక భరతనాట్యరంగ ప్రవేశం సంప్రదాయబద్ధంగా ప్రారంభమైంది. ప్రముఖ నాట్యాచారిణి అంజూషా కిషోర్ శిక్షణలో శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీ తీర్థ శ్రవణసదనంలో గురువారం కార్యక్రమం జరిగింది. సంప్రదాయం పాటిస్తూ పుష్పాంజలి, గణేషస్తుతి నాట్యానికి ఆది దేవుడైన పరమేశ్వరుని ప్రార్థిస్తూ శివాష్టకం, అర్ధనారీశ్వరం, రామభక్తాగ్రేసుడు రామదాసు రచించిన రారా నావెన్నాముద్ద గోపాల నాకీరా చిన్నముద్దు, మహిసాసురమర్దని, చివరిగా మంగళం అంశానికి నృత్యాన్ని అభినయించారు. అంజూషా కిషోర్ నట్టువాగం, గాత్రం సంగీత్, వయోలిన్ శృతికాంత్, శశిధరన్ మృదంగం, వీణపై సౌందర్యరాజన్ సహకరించారు. యజ్ఞ చంద్రశేఖర్ దెందుకూరి మాధవీలత దెందుకూరి, వెంకటేశ్వర హవిర్యాజి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు. సాత్వికను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

డీహైడ్రేషన్ వల్లే విద్యార్థినులకు అస్వస్థత


విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీవైఈఓ, ఎంఈఓ-2

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం గుడివాడ డివిజినల్ ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ విచారణ నిర్వహించారు. పాఠశాలలో బుధవారం ఆహారం కలుషితమై ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురయ్యారని వార్తలు వచ్చిన నేపథ్యంలో వారు విచారణ చేపట్టారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో వేర్వేరుగా సమావేశమై వివరాలు సేకరించారు. ఒక విద్యార్థిని అనారోగ్య సమస్యలతో, మరో ఇద్దరు విద్యార్థినులు అధిక ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్‌కు గురై కళ్లు తిరిగినట్లు వారి తల్లిదండ్రులు వివరణ ఇచ్చారు. హెచ్ఎం, ఉపాధ్యాయుల సమాచారం మేరకు తమ పిల్లలను పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించినట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వివరణను లిఖితపూర్వకంగా తీసుకున్న డీవైఈఓ కొండా రవికుమార్ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు. ఎంఈఓ–2 ఎం.కమల పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని ఎనిమిదో ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ జూనియర్ వారెంట్ ఆఫీసర్ సూరజ్ సూచించారు. కొత్తపేట హిందూ హైస్కూల్ ఎన్‌సీసీ అధికారి బి. బ్రహ్మేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఎన్‌సీసీ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అనేది విద్యార్థులు తమ ఇంటి నుంచే మొదలు పెట్టాలని సూచించారు. మొక్కలు నాటడంతోపాటు పరిరక్షించే బాధ్యతను కూడా విద్యార్థులు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. వయసు, విషయ పరిజ్ఞానం, దేహదారుఢ్యం అనుసరించి 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు హెచ్ఎం వివరించారు. సీనియర్ ఉపాధ్యాయులు యు.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, జి.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బీబీఏలో న్యాయమూర్తులకు ఘన సత్కారం


కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

విజయవాడలీగల్: విజయవాడ కోర్టు ప్రాంగణంలో గురువులను గౌరవించుకుంటూ పలువురు జడ్జిలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు గురువారం అన్న వితరణ చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే భాషా ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది ఆకుల పాండురంగ విఠల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జడ్జిలందరూ న్యాయవాదులతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అతిథులు విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆకుల శేషసాయి, రెండో అదనపు జిల్లా జడ్జి ఏ సత్యానంద్, 13వ అదనపు జిల్లా జడ్జి డి. శేషయ్య, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బి. రాధారాణి, 7వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ఎల్ శ్రీనివాసరావులను సత్కరించారు.